www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 23 ఆగస్టు 2025



సమస్యలను డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ(డిఎల్ఎస్ఎ)దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబు ఫకృద్దీన్ అన్నారు. శుక్రవారం నగరంలోని శంకరాపురంలో ఉన్న ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు నల్సా పథకాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, సపోర్ట్ పర్సన్స్ గార్డియన్, వార్డ్ యాక్ట్, బాల, కౌమార లేబర్ చట్టం 1986 వంటి వాటిపై వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్డ్ (ట్రాన్స్‌జెండర్ అండ్ సీనియర్ సిటిజన్ కృష్ణ కిషోర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, వివిధ ప్రభుత్వ అధికారులు, ఎన్జీఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సా..గుతున్న.. ఖరీఫ్!

- కెసి ఆయకట్టుపైనే ఆశలు
- కడపలో 21.33, అన్నమయ్యలో 13.63 శాతంలోనే విత్తనం

ఖరీఫ్ సీజన్ మందగమనంలో సా..గుతోంది. ఈ ఏడాది జూన్ ప్రారంభానికి ముందే రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి మాయం కావడం వంటి అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా రైతాంగం నిరుత్సాహానికి గురైంది. ఈ నెల మూడవ వారం నడుస్తున్నప్పటికీ సాగు ఆశించిన రీతిలో ఊపందుకోలేదు. ఖరీఫ్ సీజన్ లక్ష్యాన్ని చేరుకోవడం గగనంగా మారింది. నాలుగు రోజుల కిందట బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆశించిన వర్షపాతం కురుస్తుందనే ఆశా భావం సన్నగిల్లింది. కడప జిల్లాలో 21.33 శాతం, అన్నమయ్యలో 13.63 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడిన నేపథ్యంలో ఆందోళన నెలకొంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ నత్తనకడన సాగుతోంది. ఉభయ జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరి స్థితులు నెలకొనడం సాగు లక్ష్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. కడప జిల్లాలో 1,91,363 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,40,797 ఎకరాల సాధారణ విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలని వ్యవసాయశాఖలు లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఉభయ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కడప జిల్లాలో 40,284 ఎకరాల్లోనే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో 19,193 ఎకరాల్లోనే విత్తనం పడింది. గతేడాది కడప జిల్లాలో 45 వేలకుపైగా ఎకరాల్లో, అన్నమయ్య జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన కడప జిల్లాలో 21.33 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 13.63 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన 79 నుంచి 96 శాతం పొలమంతా బీళ్లుగా దర్శనమిస్తోంది. ఈ ఏడాది ఉభయ జిల్లాల రైతాంగం సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేసింది. ఫలితంగా ఖరీఫ్ సాగు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కడప జిల్లాలో వరి సాగు 76,085 ఎకరాలకు గానూ 17,576 ఎకరాలు, వేరుశనగ 6,165 ఎకరాల్లో సాగుకు 2,465 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. మొక్కజొన్న 2,675 ఎకరాల సాగుకు గానూ 4,552 ఎకరాల్లో లక్ష్యానికి మించి సాగైంది. పత్తి 59,368 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 8,810 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది.అన్నమయ్య జిల్లాలో 1,40, 797 ఎకరాల్లో పంటల సాగు చేయడం వ్యవసాయశాఖ లక్ష్యం. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నుంచి నేటి వరకు 19,193 ఎకరాల్లోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన ఆహారపు పంట వేరుశనగ. జిల్లా వ్యాప్తంగా 93,892 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 8,835 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఈలెక్కన 9.04 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన 91 శాతం పొలమతా బీళ్లుగానే దర్శనమిస్తోంది.

ఈ ఏడాది జూన్, జులై, ఆగస్టు మాసాల్లో తీవ్ర వర్షాభావం వెంటాడింది. 68.2 మిల్లీమీటర్ల నమోదు కావాల్సి ఉండగా 21.6 శాతమే నమోదైంది. ఈలెక్కన -68.3 మిల్లీమీటర్లు లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. గతేడాది జూన్‌లో 102 మిల్లీమీటర్లు అధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. జులైలో 96.7 శాతం సాధారణ వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా, 50.1 శాతం నమోదైంది. ఆగస్టులో 118 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 120 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం కాస్త ఊరటనిచ్చింది. ఈలెక్కన జిల్లా వ్యాప్తంగా -11.6 శాతం లోటు కొనసాగుతుండడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో జూన్‌లో 75.1 మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సి ఉండగా 26.6 శాతమే కురిసింది. ఈలెక్కన -64.6 శాతం లోటు కొనసాగుతోంది. జులైలో 62.2 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 42.9 మిల్లీమీటర్లు నమోదు కావడం గమనార్హం. ఈలెక్కన -31.0 మిల్లీమీటర్లు లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టులో సైతం మోస్తరు వర్షపాతానికి పరిమితం కావడం గమనార్హం. ఈలెక్కన అన్నమయ్య జిల్లా -44 లోటు వర్షపాతం కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాని పరిస్థితుల నేపథ్య ంలో 75 శాతంలోపు ఖరీఫ్ సాగు పడిపోతుందనే అంచనాల నేపథ్యం ఆందోళన కలిగిస్తోంది.

సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం

జిల్లాలో ఈస్ట్, నార్త్ మన్‌సూన్ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సెప్టెంబర్ వరకు విత్తనం వేయడానికి అవకాశం ఉంది. జులై మాసంలోనే కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో 30 వేల హెక్టార్లలో వరి, ఇతర పంటలు సాగుకు అవకాశం ఉంది. లక్ష్యాన్ని అందుకునే అవకాశం ఉందని ఆశాభావంతో ఉన్నాం.

- బి.చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

రైతులకు అందుబాటులో ఎరువులు

నేటి నుంచి విజిలెన్స్ తనిఖీలు
అధిక రేట్లకు అమ్మితే చర్యలు
కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎరువులు అవసరమైన మేర స్టోరేజీ అందుబాటులో ఉందన్నారు. డిమాండ్ ఆధారంగా ఎరువులు ఆర్ఎస్‌కెల ద్వారా అందజేస్తామని తెలిపారు. అక్కడ అందుబాటులో లేకపోతే 24, 48 గంటల్లో సమకూరుస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆర్ఎస్‌కెలలో 3700 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు వినియోగించు కోవాలన్నారు. ప్రయివేట్ ఎరువుల డీలర్స్ నిబంధనల ప్రకారం మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. బల్క్‌స్టాక్ పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. ఈనెలలో 15 రోజులు ముందుగానే కెసి కెనాల్ పరిధిలో సాగు మొదలైందని రైతులందరికీ అవసరం మేరకు యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉందని తెలిపారు.. ఒక ఎకరాకు ఒక యూరియా బస్తా సరిపోతుందని రైతులు ఆందోళన చెందకుండా అవసరం మేరకు వినియోగించాలని పేర్కొన్నారు శనివారం నుంచి విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరకు రైతులకు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని సమస్యలు ఉంటే 833 1057300 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. సమావేశంలో జెసి అదితి సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ జెడి చంద్రా నాయక్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారి, ప్రజా రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

కడప : కడప నగరపాలక పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థతో పాటు శివారు ప్రాంతాలను రహదారి, ప్రజా రవాణా వ్యవస్థను ప్రజలకు మరింత సులభతరం చేసేలా ప్రత్యేక చర్యలను తక్షణమే చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కడప ఆర్‌డిఒ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కడప నియోజకస్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే మాధవి,



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. నగర ప్రధాన ప్రాంతాలను నగర శివార్లలోని ప్రాంతాలను కలుపుతూ కడప నియోజకవర్గ పరిధిలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరిచే చర్యలను చేపట్టే ప్రణాళికను రూపొందిస్తామన్నారు. రామాంజనేయపురం సమీపంలోని టిడ్కో గృహ సముదాయాల్లో, అలాగే చలమారెడ్డి పల్లె హౌసింగ్ కాలనీల్లో తాగునీరు, విద్యుత్ అన్ని రకాల మౌలిక సదుపాయాలను అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరిన గృహాలను అక్టోబర్ 2వ తేదీ నాటికి అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారవాణా వ్యవస్థలో భాగంగా కడప పాత బస్టాండులో పార్కింగ్, కొత్త బస్టాండు డిపో ఆవరణలో ఎపిఎస్‌పిడిసిఎల్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు 15 సెంట్ల స్థలం అవసరం అవుతుందని, కడప నగరానికి నూతన 132 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నగరంలోని చాలా పాఠశాలల్లో తాగునీరు, ఆర్‌ఒ ప్లాంట్లు, వాష్ రూములు, సింటెక్సులు, బెంచీల కొరత ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తూ నగరంలో కంటే గ్రామాల్లోనే వసతులు మెరుగుగా ఉన్నాయన్నారు. ఇరిగేషన్ కు సంబంధించి నగరంలో ఎలాంటి వరద ముప్పు అవకాశాలు లేవన్నారు. అనంతరం డ్వామా, డిఆర్‌డిఎ మెడికల్, ఐసిడిఎస్, విద్యాశాఖ, వ్యవసాయ మార్కెటింగ్, విద్యుత్ శాఖ, పరిశుధ్యం, రవాణా, ట్రాఫిక్, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్,ఎమ్మెల్యేలు సమీక్షించి పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

28న కడపలో విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం

ప్రజాశక్తి కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈనెల 28న నిర్వహించనున్న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం జయప్రదం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2000, ఆగస్టు 28వ తేదీన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి అమరులయ్యారని తెలిపారు. వీరి స్ఫూర్తితో ఈనెల 28న కడపలో అమరవీరుల ప్రతిజ్ఞ దినంగా చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ భారాలు మోపుబోమని హామీలు ఇచ్చి నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. మొదటి విడతలో 15,474 కోట్లు, రెండవ విడతలో 12,717 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిందన్నారు. ఈ భారాల కారణంగా సామాన్య ప్రజనికం నుంచి అత్యధికమంది ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల ఇప్పటికే భారాలు పెరిగాయని, రానున్న కాలంలో ఈ భారం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానికం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నాయకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో కడప నగరంలోని 27వ డివిజిన్ సంబంధించిన గౌస్ నగర్ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు షర్మిలా నాయకత్వంలో కడప జిల్లా అధ్యక్షులు ఎన్. డి.విజయ జ్యోతి ఆదేశాల మేరకు కడప డివిజన్ ఇనిఛార్జులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజలు ప్రభుత్వ పథకాలు అందక బాధపడుతున్న విషయం తెలుసుకుని, ఈ ఇంటింటి కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్‌ఛార్జి సయ్యద్ షామీర్ హుస్సేన్, ఇతర డివిజన్ ఇన్‌ఛార్జిలు మాల్ బాషా, ముబా రక్, యూసఫ్, ఫజలుల్లా, కరిముల్లా, సిరాజ్, కరీం, సిద్దిక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి-కాశినాయన : రాష్ట్రవ్యాప్తంగా మే, జూన్ మాసాల్లో నిర్వహించిన బదిలీలో ఉపాధ్యాయులు కోరుకున్న ప్రాంతాలు వచ్చినప్పటికీ రిలీవర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, డిఎస్‌సి నియామకాలు త్వరితగతిన పూర్తి చేసి వారి స్థానంలో నూతన ఉపాధ్యాయులను నియమించి రిలీవ్ చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ పక్షాన రాష్ట్ర సిపిఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు పెంచి బోధనకు దూరం చేయటం వల్ల ప్రాథమిక విద్య నిర్వీర్యం అయే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, అసెస్మెంట్‌ను సులభతరం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గంజాయి వినియోగం, విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -కడప అర్బన్ : జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లాలోని ఆయా సబ్ డివిజన్ల డిఎస్‌పిల ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి సేవించే, విక్రయించే అవకాశమున్న ప్రాంతాలు, ప్రదేశాలలో అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వ్యక్తులకై ఆరా తీశారు. కిరానా షాపులు, గోడౌన్‌లు, పాడుబడ్డ క్వాంటర్లలోగంజాయి సేవించే, విక్రయించే వారి కోసం సిబ్బందితో అణువణువూ అన్వేషిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే క్షుణ్ణంగా విచారిస్తున్నారు.

వైవీయూలో విద్యార్థుల కోసం హెల్ప్ లైన్ సెంటర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూతో పాటూ జిల్లాలోని డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశం పొందే విద్యార్థుల కోసం హెల్ప్ లైన్ సెంటర్ ను ప్రారంభించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ సైట్ లోకి వెళ్లి ప్రతి విద్యార్థి డిగ్రీలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైవీయూ క్యాంపస్ లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్లైన్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు.

బ్రహ్మసాగర్‌పై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మండలంలోని బ్రహ్మసాగర్ ప్రాజెక్టును శుక్రవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పరిశీలించారు. బ్రహ్మ సాగర్ ప్రాజెక్టు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మ సాగర్ కుడి, ఎడమ కాలువల పొడవు అడిగారు. కుడి కాల్వ గుండా ప్రస్తుతం 130 క్యూసెక్కుల నీరు, ఎడమ కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీరు వెళుతున్నట్టు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం బ్రహ్మ సాగర్‌లో 7.8 టిఎంసిల నీరు ఉన్నాయని పేర్కొన్నారు. శ్రీశైలం నుండి బ్రహ్మ సాగర్‌కు 19 క్యూసెక్కుల నీరు వచ్చాయన్నారు. అనంతరం బ్రహ్మసాగర్ అతిథిగృహంలో బ్రహ్మసాగర్ ఎస్ఇ వెంకటరణమణ, మురళీకుమార్‌తో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసరెడ్డి, ముడమల పోలిరెడ్డి, పూజ శివయ్య యాదవ్, మేకల సుధాకర్, మండల తెలుగు యువత అధ్యక్షులు సన్నపురి శ్రీనివాసులు, ఎల్లటూరు సాంబశివరెడ్డి, బోల శ్రీను, పాల్గొన్నారు.

పింఛన్లను పునరుద్ధరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం : కూటమి ప్రభుత్వం తొలగించిన విభిన్న ప్రతిభావంతులు పింఛన్లను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేవంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అర్హులైన విభిన్న ప్రతిభావంతులైన వికలాంగుల పింఛన్లు తగ్గించాలని వివిధ జిల్లాల అధికారులకు అదేశాలు జారీ చేయడం ప్రజా విరుద్ధమని పేర్కొన్నారు. పేదలు, శ్రమికులు, అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని ఒక వైపు నమ్మపలుకుతూనే వాస్తవంగా ఆచరణలో సంపన్నులు, కార్పొరేట్ల ఇండస్ట్రీల అధిపతుల ప్రయోజనాల కోసం క్విట్ ప్రోకో అంతర్గత పాలసీని అమలు చేస్తోందని విమర్శించారు. వికలాంగుల పింఛన్ల కోత విధించడం క్రూరమైన చర్య అని దానిని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విభిన్న ప్రతిభావంతుల పింఛన్లు ఎవరి దయాదాక్షిన్యాలతో వచ్చినవి కావని, పోరాటాలు, ఉద్యమల కృషితో సంపాదించుకున్న కనీస హక్కులు అని తెలిపారు. పింఛన్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం వికలాం గుల్లో అత్యధిక అణగారిన వర్గాలపై, నేరుగా దాడి చేస్తోందని ఆరోపించింది. పిల్లల చదువు, వైద్యం ఖర్చులు తీవ్రంగా ప్రతి పేద మధ్యతరగతి కుటుంబాలలో పెరిగిపోవడంతో, కార్మికులు, రైతులు, మహిళలు, యువత ఇప్పుడు నలిగిపోతున్నారని వివరించారు. పెంచిన పర్సంటేజీ వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, సిపిఎం మండల కార్యదర్శి జి.సునీల్ కుమార్, బుడ్డెనబోయిన హరి, యర్రంపల్లి అజయ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని రిమ్స్ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రిమ్స్‌కు వచ్చిన వారికి ఆహార పొట్లాలు అందజేశారు. ప్రతీ వారం సుమారుగా 1000 భోజన పొట్లాలు, మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు పంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థలో వివిధ బ్రాంచ్ లో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రతీ వారం భోజన ప్యాకెట్ ప్యాకింగ్ వితరణ సమయానికి రిమ్స్ లో సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

లావణ్య కవిత్వంలో నిశిత పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : తన చుట్టూ ఉన్న సామాజిక స్థితి గతులను చూసి పరవశంతో,ఆనందంతో,విషాదంతో,దుఃఖంతో గుండె లోతుల్లోంచి పుట్టుకొచ్చిన కవిత్వమే లావణ్య' రాసిన ' కమనీయ కవితల'ని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం వారి ఆధ్వర్యంలో జి.వి.లావణ్య కవిత్వీకరించిన 'కమనీయ కవితలు' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో తన ముందు కదలాడిన అపురూప దృశ్యాలను, ఆనందమయ సన్నివేశాలను, అస్తవ్యస్త సంఘటనలను లావణ్య అద్భుతమైన రీతిలో చిత్రించారన్నారు. ముఖ్య అతిథి మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ లావణ్య సున్నితమైన భావాలను కూడా మధురమైన శైలిలో చక్కగా ఆవిష్కరించారని తెలిపారు. తనకు కలిగిన ఆలోచనలకు,అనుభూతులకు అక్షర రూపాన్ని ఇచ్చారన్నారు. అనంతరం వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం వారు కవయిత్రి జివిఎల్ లావణ్యను ఘనంగా సత్కరించారు.

విద్యార్థి ఆత్మహత్యపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలి

- మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న బంధువులు

ప్రజాశక్తి - వేంపల్లె



విద్యార్థి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

ఇడుపులపాయ ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్‌ఐటి హాస్టల్‌లోని బాత్రూ ంలో కిటికికి ఉరి వేసుకుని జి. నరసి ంహనాయుడు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. మృతుని ఆత్మహత్యపై బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం, షేర్ మహమ్మదాపురం గ్రామం నుంచి మృతుని చిన్నాన్న ఉమామహేశ్వరరావు, బంధువులు శుక్రవారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల ఐటికి చేరుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి పలు అనుమానాలు వ్యక్తం చేసి ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి చనిపోయినా తల్లి రాజులమ్మ కష్టపడి చదివిస్తుండేదని తెలిపారు. తమ పిల్లవాడు బాగా చదివేవాడని మంచి మార్కులు వచ్చేవని తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ (పియుసి-1)లో కూడా 7.5 గ్రేడింగ్ పాయింట్లు వచ్చాయని చెప్పారు. ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో నరసింహనాయుడుని చూసి చిన్నాన్న, బంధువులు బోరున విలపించారు. పూర్తి దర్యాప్తు నిర్వహించాలని పులివెందుల డిఎస్‌పి మురళినాయక్, సిఐ ఉలసయ్యలను కోరారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి తమ స్వగృహానికి తీసుకెళ్లారు. విద్యార్థి మొబైల్‌లో ఉన్న నోట్ బుక్‌లో 'ఐ వాంట్ టు డై సారీ మమ్మీ' అని కూడా రాశాడని పోలీసుల దర్యాప్తులో తేలిందని ట్రిపుల్ ఐటి అధికారులు చెప్పుకొచ్చారు. కళాశాల యాజమాన్యం, అటు పోలీసులు పూర్తి విచారణ చేసి మృతుని కుటుంబానికి ఏం న్యాయం చేస్తారో వేచి చూడాలి.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు కృషి : జెసి

ప్రజాశక్తి - కడప : స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యాలను చేరుకునేందుకు, జిల్లా వృద్ధి రేటు 15 శాతానికి పెంచేందుకు అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో స్వర్ణాంధ్ర విజన్- 2047 లో భాగంగా వివిధ శాఖలు నిర్దేశించిన లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో అన్ని రంగాల్లోనూ వృద్ధి రేటు 15 శాతం సాధించేందుకు లక్ష్యం మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఉద్యాన, వ్యవసాయ, పరిశ్రమలు రంగాల్లో పురోగతి సాధించాలని పేర్కొన్నారు. పర్యాటక శాఖ,పశుసంవర్ధక శాఖ, సెరికల్చర్, వైద్యఆరోగ్యశాఖ, మార్కెటింగ్, ఆయుష్, ఇరిగేషన్, పరిశ్రమలు, పంచాయితీ రాజ్ వివిధ శాఖలు సూచికల ఆధారంగా సాధించిన లక్ష్యాలను, రాబోవు సంవత్సరానికి టార్గెట్లపై అధికారులతో జాయింట్ కలెక్టర్ చర్చించారు. కార్యక్రమంలో సిపిఒ హాజరతయ్యా, పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా, ఐసిడిఎస్ అధికారి రమాదేవి, పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, పర్యాటక శాఖ అధికారి సురేష్, ఇతర జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్ : పర్యావరణ పరి రక్షణ అందరి బాధ్యతని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే పోస్టర్లను శుక్రవారం జమ్మలమడుగులో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కావడం ద్వారా అనేక వాతావరణ మార్పులు చెంది ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ , మున్సిపల్ కార్యాలయ అధికారి శ్రీనివాసులు జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్ నాయకులు సుదర్శన్ పాల్గొన్నారు.

అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

డిఎస్‌సి-2025 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, వెబ్‌సైట్ ద్వారా సమాచారం అందుకున్న వారు ఆ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో మూడు సెట్ల అటెంటెడ్ కాపీలతో హాజరు కావాలని డిఇఒ షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలాజీ నగర్‌లోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్స్ పరిశీలన ఉంటుందని తెలిపారు. అన్నీ ఒక ఫోల్డర్‌లో భద్రపరిచి హాల్ టికెట్ నంబర్ పేరు రాసి ఇవ్వాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్లు అప్లోడ్ చేసి రావాలని తెలిపారు.

చామంతి రైతు వినూత్న ఫీట్లు!

కాడెద్దులుగా కుమార్తె, కుమారుడు
ఖర్చులు భరించలేక కృషీవలుని కుస్తీ



పొలం దున్నుతున్న రైతు కుమార్తె, కుమారుడు

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

జిల్లాలోని చామంతి రైతులు కష్టాల కడలిలో ఉన్నారు. ప్రతి ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులకుతోడు మార్కెట్లో ధరలు నిలకడగా లేకపోవడంతో చామంతి రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, వేముల, వేంపల్లి, వీరపునాయునిపల్లి, సిద్ధవటం, ఖాజీపేట తదితర మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో చామంతి సహా పలు ఇతర రకాల పూల పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో చామంతిని సాగు చేసే మండలాల్లో పెండ్లిమర్రి ముందువరుసలో ఉంటోంది. ప్రతి ఏటా పెరుగుతున్న సాగు ఖర్చుల నేపథ్యంలో పెండ్లిమర్రి మండలం రంపతాడు పంచాయతీ మమ్ముసిద్దపల్లి గ్రామానికి చెందిన బండి శేఖర్‌రెడ్డి అనే చామంతి రైతు సాగు ఖర్చులు తగ్గించుకునే ప్రయత్నం చేశారు. తన మూడు ఎకరాల పొలంలో సాగు దశ నుంచి కాపు దశ వరకు సాగు ఖర్చులను ఎలా తగ్గించుకోవాలనే ఆలోచన చేశారు. ప్రతిఏటా చామంతి సాగులో కలుపు తీయడం, కోతకు కూలీలు, ఎరువులు, పురుగు మందులు ఖర్చులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. పెరిగిన సాగు ఖర్చులకు అనుగుణంగా మార్కెట్‌లో ధరలు లేకపోవడం, ఉన్న అరకొర ధరలు సైతం నిలకడగా లేకపోవడం వంటి కారణాలతో దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అనే చందంగా పరిస్థితి తయారైంది. చామంతిలో సాగు ఖర్చులు తగ్గించుకునే ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. కుమార్తె, కుమారులను కాడెద్దులుగా కాడి ఇరు వైపులా కట్టి చామంతి సాగులో కలుపు తీయడానికి నాగలితో దున్నే ప్రయత్నం చేశారు. ఇటువంటి అరుదైన సన్నివేశం సోషల్ మీడియా కంట పడడంతో వైరల్‌గా మారింది. ఇదేతరహా పరిస్థితిని జిల్లాలోని పలువురు చామంతి రైతులు ఎదుర్కొంటున్న దుస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించడం చర్చనీయాంశంగా మారింది.

ఫిర్యాదుదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు : ఫిర్యాదుదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని ఎస్‌ఐ చిన్న పెద్దయ్యను ఆదేశించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను త్వరగా డిస్పోజ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

25న చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. శుక్రవారం నగరంలోని స్థానిక బాలుర ఎస్‌సి హాస్టల్‌లో చలో కలెక్టరేట్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరపోగు రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా కనీసం విద్యార్థులకు ఇచ్చిన హామీలు కానీ, విద్యారంగ సమస్యల పరిష్కారం, చట్టం కానీ పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని తెలిపారు. జిఒ 77 ను వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎఫ్ జిల్లా కమిటి సభ్యులు చారీ, నగర ఉపాధ్యక్షులు శ్రీను, అఖిలేష్, నగర నాయకులు, నవీన్, మనోహర్, నారాయణ, రంగ స్వామి, నాయకులు పాల్గొన్నారు.

వైవీయూను సందర్శించిన శిల్పాల పరిశోధకురాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : డిప్యూటీ కమాండెంట్ 168 బిసి ఆర్‌పిఎఫ్ ఆర్పీఎఫ్ బీజాపూర్ చత్తీష్‌ఘడ్ రాష్ట్రాల ఆలయ ఐకోనోగ్రఫీ(సంప్రదాయ శిల్పాల) పరిశోధకురాలు, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.షర్మిల యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగాన్ని పరిశోధన నిమిత్తం సందర్శించారు. విభాగాధిపతి డాక్టర్ కె.మృత్యుంజయరావుతో కలిసి ఆలయాల ఐకోనోగ్రఫీ, ఆలయ నిర్మాణాల గురించి చర్చించారు. చారిత్రక పరిశోధన ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు.

ప్రజల దాహార్తిని తీరుస్తా : 'చమర్తి'

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన జగన్మోహన్‌రాజు శుక్రవారం ఒంటిమిట్టకు వచ్చారు. బస్టాండ్ వచ్చిన ఆయనకు కార్యకర్తలు పెద్ద ఎత్తున గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురుపించారు. అనంతరం శాలువ కప్పి సన్మానించారు. అక్కడి నుంచి బజారు గుండా రామాలయానికి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం జగన్మోహన్‌రాజు మీడియాతో మాట్లాడుతూ ఒంటిమిట్ట ఆలయం సుప్రసిద్ధమైందని, ఆలయంలో అభివృద్ధి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కార్యరూపం దాల్చుతామని చెప్పారు. తాను గతంలో మాట ఇచ్చిన ప్రకారం ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయించి ఒంటిమిట్ట మండల ప్రజల దాహార్తిని తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఒంటిమిట్ట వచ్చే బ్రహ్మోత్సవాలకు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




జగన్‌మోహన్‌రాజుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

చెరువు కట్టలు బలహీనం.. పట్టించుకోని అధికారగణం

ప్రజాశక్తి- ఖాజీపేట

ప్రజల దాహార్తి తీర్చడానికి, సాగునీటి అవసరాలు కోసం ఏర్పాటు చేసిన చెరువులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో పాటు అధికారుల నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. దీంతో చెరువు ఆయకట్ట ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులను పరిరక్షించాల్సిన అధికారులు, వాటి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వివరాలు. మండల పరిధిలోని రావులపల్లె చెరువు మట్టి మాఫియాకు కేంద్ర బిందువుగా మారింది. చెరువుకు నీరు రాక మునుపు మట్టి మాఫియా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని అక్రమంగా రవాణా సాగించి కాసులు వెనకేసుకొచ్చారు. ఈ తతంగం అంతా నీటిపారు శాఖ అధికారులకు తెలిసినా స్పందించలేదు. మట్టి మాఫియా ఇష్టానుసారంగా అక్రమ తవ్వకాలు చేపట్టడంతో చెరువు కట్టలు బలహీనంగా మారాయి. ప్రస్తుతం చెరువుకు కెసి నీటిని మళ్లించడంతో చెరువు పూర్తి సామర్థ్యంతో నిండింది. చెరువులోని నీటి పరిమాణానికి చెరువు కట్టలు తట్టుకోలేని స్థితి కనిపిస్తోంది. చెరువుల కట్టలను అభివృద్ధి చేయాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల కళ్ళ ముంగిట ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోలేకపోయారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు కట్టల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిండుకుండలా ఉన్న రావులపల్లె చెరువు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

భావితరాలకు బాసటగా నిలుద్దాం

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మొక్కలు పెంచి భావితరాలకు బాసటగా నిలవాలని వనిపెంట ఎంజెపి ఎపి బిసి వెల్ఫేర్ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ వి.నిర్మల పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో లెక్కలవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నరసింహులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వరరెడ్డి అందజేసిన 100 దురంతాలు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వి.నిర్మల మాట్లాడుతూ సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు ఆధార భూతమైన జీవనాధారమైన మొక్కలను పెంచడం మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, పెళ్లి రోజులు, పండుగల రోజులు గృహప్రవేశాలు వంటి శుభకార్యాల సందర్భాలలో విధిగా ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరిఢవిల్లిన నేటి ఆధునిక యుగంలో గ్లోబల్ వార్మింగ్ చేత పర్యావరణానికి వాటిల్లిన పెను ముప్పు నుండి భావితరాల మన వారసుల మనుగడను ప్రశ్నార్ధకం కానివ్వకుండా చూడాలన్నారు. అసిస్టెంట్ ప్రిన్సిపల్ ఎస్ నసీరా బేగం, వార్డెన్ అనురాధ, వ్యాయామ ఉపాధ్యాయురాలు పి శైలజ స్టాఫ్ నర్స్ కే సౌమ్య రాణి ఉపాధ్యాయులు ఎస్ వసంతకుమారి ,ఎం ఉషారాణి, దస్తగిరమ్మ పి సుధా శ్రీ ,చైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - తొండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ శుక్రవారం పంపిణీ చేశారు. పులివెందులకు చెందిన రాచమల్లు సునీల్ కుమార్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మొత్తం రూ.12,000 విలువైన మెటీరియల్‌ను 45 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సునీల్ కుమార్‌రెడ్డి చేసిన సాయం విద్యార్థులకు చదువులో ఉపయోగపడుతుందని, వారికి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారి మఠం ఆలయ అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బ్రహ్మంగారి మఠానికి విచ్చేసి అధికారులతో మాట్లాడారు. వెంటనే డ్రైయినేజీ, అభివృద్ధి పనులకు మార్క్ ఇచ్చి పనులు ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. తొలగించిన షాపుల స్థానంలో వెంటనే మార్క్ ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఇప్పటికే షాపులు తొలగించి చాలా రోజులైందని, షాపుల యజమానులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి మార్క్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పోలిరెడ్డి, సాంబశివారెడ్డి,నరసింహ గౌడ్, సుధాకర్, గంగరాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

వ్యాపారులు విచ్చలవిడిగా ప్లాస్టిక్ క్యారీ కవర్స్, ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్నారని, దీంతో పట్టణంలో ప్లాస్టిక్ వాడకం అధికంగా ఉందని పూర్తిగా నివారించాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పార్సిల్ కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని ఆర్భాట ప్రచారాలు చేసిందని, కాని నివారించడంలో విఫలమైందని ఆరోపించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల తల్లి పాలలో సైతం ప్లాస్టిక్ పరిమాణాలు కనిపిస్తున్నాయని ఓ సర్వే సంస్థ వెల్లడించిందన్నారు. ప్లాస్టిక్ కవర్లే కాకుండా ప్లాస్టిక్ రూపంలో ఉన్న వాటర్ బాటిల్లు, కూల్ డ్రింక్ బాటిళ్లను ఇతర ప్లాస్టిక్ వస్తువులను సైతం నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ రహిత జమ్మలమడుగుగా నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ బలమైన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యుడు సాయికిరణ్. కరిముల్లా. అరుణ్. పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మేడపై నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్ (మైలవరం)

ప్రమాదవశాత్తు మేడపై నుండి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలవరం మండలం తలమంచి పట్నం గ్రామపంచాయితీలోని మాధవరం గ్రామంలో చోటుచేసుకుంది. బంధువుల వివరాల మేరకు బనగాని వెంకట శివుడు (56) ఈనెల 21న రాత్రి మనవడి పుట్టినరోజు సందర్భంగా పెద్ద ఎత్తున బంధువులందరినీ పిలిపించుకొని వేడుకలు నిర్వహించుకున్నారు. అనంతరం మేడపై పడుకొని రాత్రి 11:30 సమయంలో అనుకోకుండా కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

బాల్య వివాహాలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం తెలిపారు. శుక్రవారం హై స్కూల్ విద్యార్థులకు 1098 గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకమే కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. సమాజంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతి ఒక్కరూ గళాన్ని వినిపి ంచాలన్నారు. బాల్య వివాహ రహిత సమాజం సాకారానికి కృషి చేయాలని కోరారు. చదువుకు దూరమైన బాలికలను గుర్తించి పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నప్పుడు 1098ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, వరలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల, పాములూరు ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు లైంగిక వేధింపులకు గురైనా, బానిసలైనా, ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించి 1098కు సమాచారం ఇచి ఇస్తే వారిని కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టడానికి కృషి చేయాలని చెప్పారు. బాలలకు సంబంధించి ఎలాంటి సమస్య నైనా 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుభద్రమ్మ, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **చక్రాయపేట :** విద్యార్థులు చట్టాలపై విద్యాభ్యాసం నుంచి అవగాహన పెంచుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగ సువాషిణి పేర్కొన్నారు. శుక్రవారం చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం పిల్లల సహాయార్థం ఏర్పాటు చేసిన సేల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్1098 పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఏదైనా సమస్యలు ఎదురైతే పై నంబర్‌కు డయల్ చేయాలన్నారు. వెంటనే సంబంధిత ప్రభుత్వ అధికారులు స్పందించి ఆ సమస్యకు పరిష్కారం చూపుతారన్నారు. కార్యక్రమంలో కుప్పం సెక్టార్ సూపర్‌వైజర్ భారతి, సురభి నాగలగట్టుపల్లె సూపర్‌వైజర్ శ్రావణి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర కుమార్, అంగన్వాడీ వర్కర్లు లలిత, ముంతాజ్ బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేముల : పిల్లలు తమ రక్షణ కోసం 1098 హెల్‌లైన్ నంబర్‌లో సంప్రదించాలని తహశీల్దార్ రెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక హైస్కూల్, కొత్తపల్లి హైస్కూల్‌లలో విద్యార్థులకు హెల్ప్‌లైన్ నంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆపద కల్గినప్పుడు హెల్ప్‌లైన్ నంబర్‌కు డయలు చేయాలని సూచించారు. ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చున్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హసీనా, వేముల హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి, కొత్తపల్లి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు భవాని, ఇతర ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసు, అంగన్వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.



చాపాడు : మాట్లాడుతున్న సిడిపిఒ ముంతాజ్‌బేగం

ఓట్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి నేతలకు ఓట్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై లేదని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధృవ కుమార్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉన్న ఎంపిడిఒ కుళాయమ్మను కాంగ్రెస్ నేతలతో కలిసి వేంపల్లె పారిశుధ్యంపై, వికలాంగుల పింఛన్లు వంటి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె పంచాయతీ పరిధిలో పారిశుధ్య పడక వేసిందని చెప్పారు. కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం తప్పా అభివృద్ధి పనులపై, పారిశుధ్యంపై దృష్టి పెట్టక పోవడం దారుణమని చెప్పారు. ఒక రోజు కూడ కూటమి నేతలు పారిశుధ్యంపై అధికారులతో చర్చించిన పాపాన పోలేదని చెప్పారు. వేంపల్లె ప్రజలు ఆరోగ్యంగా ఉండడం కూటమి నేతలకు ఇష్టం లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఉప ఎన్నికలు వస్తేనే వేంపల్లె ప్రజలను పట్టించు కొంటారని అన్నారు. పులివెందుల జడ్‌పిటిసి ఎన్నికలకు కూటమి నేతలు ఖర్చు పెట్టిన డబ్బులు మూడు గ్రామ పంచాయతీలను బాగు చేయవచ్చు అన్నారు. గొప్పలు చెప్పుకోవడం తప్పా కూటమి నేతలు ఏమీ చేయడం లేదని చెప్పారు. పారిశుధ్యంపై పనులు చేపట్టక పోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద పోరాటం చేస్తామని అధికారులకు హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో వేంపల్లె, చక్రాయపేట, వేముల మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, రాఘవయ్య, సాయి, వేమయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - వల్లూరు

వినాయక చవితి మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి, మండలంలో వినాయక చవితి పండుగను శాంతియుతంగా చట్టబద్ధంగా పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలని వల్లూరు ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ సింగిల్ విండో విధాన ంలోనే పర్మిషన్ పొందాలని తెలిపారు. ఏ విధమైన నిబంధనలు ఉల్లం ఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక మండపాల వద్ద రికార్డ్ డాన్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మైదుకూరు రూల్

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులతో ఆప్యాయంగా మాట్లాడి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నాపరు. ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం, పోస్టుమార్టం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభించి ప్రజలు అందుబాటులో తెస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.పి. రవీంద్ర, అన్నవరం సుధాకర్‌రెడ్డి మిల్లు శీను టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

అవయవదానంపై అవగాహన కల్పించాలని కొవ్వూరు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ అవయవదానం దినోత్సవం సందర్భంగా కొవ్వూరు గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవయవ దానం ఎంతో గొప్పదని, దీనిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో చనిపోతున్నారని అన్నారు. 2003లో తనకు అవయవ దానం ద్వారా లివర్ ప్లాంటేషన్ జరిగిందని, 2008లో కిడ్నీ మార్పిడి చేశారని తెలిపారు. లివర్ ప్లాంటేషన్ చేయడానికి స్విట్జర్లాండ్ వెళ్లాల్సిన పరిస్థితి వచ్చినా హైదరాబాదులో నూతనంగా ఏర్పాటు చేసిన గ్లోబల్ హాస్పిటల్‌లో లివర్ ప్లాంటేషన్ గురించి తెలుసుకొని వరంగల్‌కు చెందిన రామప్ప కూతురు బ్రెయిన్డెడ్ కారణంగా చనిపోతే ఆ అమ్మాయి లివర్ తనకు అమర్చారని చెప్పారు. 23 సంవత్సరాలు అవుతున్నా తాను ఎంతో ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గతంలోనూ చాలా అవగాహన సదస్సులు నిర్వహించానని తెలిపారు.

సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాల పట్ల బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రొబెషనరీ ఎస్ఐ అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. పులివెందుల పట్టణం అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన మాదక ద్రవ్యాల నివారణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యుక్త వయసులో మద్యపానం, ధూమపానంలతో పాటు గంజాయి, గుట్కా, పాన్ లాంటి మత్తు బారిన పడుతూ ఉజ్వల భవిష్యత్ కలిగిన యువత క్రమశిక్షణ, విచక్షణ మరచి నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. బాలికలు, మహిళలు వయసుతో సంబంధం లేకుండా సామాజిక మాధ్యమాలకు బానిస కావడం సైబర్ నేరస్థుల చేతిలో చిక్కుకుని అసాంఘిక కార్యకలాపాలకు మానవ అక్రమ రవాణాలకు గురి అవుతున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ మాదక ద్రవ్యాలు, సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సామాజిక మాధ్యమాలపై పలు సూచనలు అందించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలు వాడకం మొదట్లో హీరోయిజంతో మొదలు అయి ఆరోగ్యం దెబ్బ తింటారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు భారంగా మారడం, ఆర్థికంగా బలహీనం కావడంతో పాటు సమాజంలో పూర్తి గౌరవాన్ని కోల్పోతారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



డాబాలో సోదాలు చేస్తున్న పోలీసులు

మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

డాబాల మాటున మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి హెచ్చరించారు. కడప తాడిపత్రి రహదారిలోని డాబాలను శుక్రవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాబాల్లో గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మత్తు పదార్థాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డాబా నిర్వాహకులను సూచించారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే శిక్షార్హులు అవుతారన్నారు .కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం

ప్రజాశక్తి-చెన్నూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఏడాది కాలంలోనే దాదాపు నాలుగున్నర లక్షల పింఛన్లు తీసివేడం దారుణమని, 15 ఏళ్ల నుంచి తీసుకుంటున్న వారివి కూడా తొలగించడం హేయనీయమని వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ ప్రధాన కార్యదర్శి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలం గడిచిన తరుణంలో రాష్ట్రంలో ఉన్నటువంటి వివిధ కేటగిరీలకు సంబంధించిన సామాజిక, వికలాంగుల పింఛన్లు తొలగించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచించి వికలాంగులకు న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. 2024 ఎన్నికల ముందు నాటికి పింఛన్లు 66. 34 లక్షలు ఉండగా 2025 ఆగస్టులోకి వచ్చేసరికి ఇచ్చిన పెన్షన్లు కేవలం 62.19 లక్షలు మాత్రమేనని తెలిపారు. గత ప్రభుత్వంలో వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పారదర్శకంగా పింఛన్లు అందించేవారని పేర్కొన్నారు. వారిపై కక్ష సాధింపు చర్యలు మానుకుని పింఛను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్థిక నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

ఆర్థిక నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సర్పంచ్ రాయపరెడ్డి లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ వారి సౌజన్యంతో తోట్లపల్లి గ్రామ సచివాలయం దగ్గర సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ క్రైమ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు, సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ ఆఫీసర్ సుధాకర్ మాట్లాడుతూ డిపాజిటర్లకు అవగాహన లేకపోవడంతో రూ. కోట్ల డిపాజిటర్లు వదిలేసారని ఆయన తెలిపారు. గ్రామస్తులు బ్యాంకు లావాదేవీల పైన అవగాహన పెంపొందించుకొని వాటి సేవలను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని కోరారు, కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె ఉదయ్ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ముద్దనూరు పట్టణంలో శనివారం ఉదయం 9 నుంచి గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని శుక్రవారం విద్యుల్ ఎఇ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు

ముగిసిన మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - బద్వేలు

శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీజీ (అటానమస్) కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైందని కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకట సాయికృష్ణ పేర్కొన్నారు. జాబ్ మేళాలో అపోలో, ండ్డీస్, గ్రో ఇవి, హెట్రో డ్రగ్ లిమిటెడ్, గ్రీన్ టెక్ లాంటి 16 కంపెనీల లో ఉద్యోగ అవకాశాలు కల్పించాయలని తెలిపారు. 264 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వీరిలో 116 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.